క్లుప్తంగా

ఆలయాల వద్ద విక్రయ హక్కులకు బహిరంగ వేలం

అచ్చంపేట: దేవదాయ శాఖ అధీనంలోని మాదిపాడు పరిధి సత్తెమ్మతల్లి, ఓర్వకల్లు గ్రామంలోని గంగాదేవి ఆలయాల వద్ద వ్యాపారులు స్టాల్స్ ద్వారా విక్రయహక్కులు పొందేందుకు గురు, శుక్రవారాలలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి గాదె కోటిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లీజు హక్కు ఈ నెల 11వ తేదీ నుంచి 2025 జూలై 10వ తేదీ వరకు అమలులో ఉంటుందన్నారు. పాటలో పాల్గొనదలచిన వారు నిర్దేశించిన ధరావతు సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొనవలసి ఉంటుందన్నారు. బహిరంగ వేలం అచ్చంపేటలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో 11వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామన్నారు. ఓర్వకల్లులోని గంగాదేవి ఆలయం వద్ద విక్రయ హక్కులకు ఈ నెల 12న ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తారని చెప్పారు. ధరావతు చెల్లించిన వారు మాత్రమే బహిరంగ వేలంలో పాల్గొనవలసి ఉంటుందని చెప్పారు. బహిరంగ వేలంలో పాల్గొనే వారు ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలన్నారు. పాటలో హిందువులు మాత్రమే పాల్గొనవలసి ఉంటుందని చెప్పారు.

సొసైటీ రైతులు సభ్యత్వం రెన్యువల్ చేసుకోవాలి

క్రోసూరు: మండల పరిధిలోని అన్ని ప్రాథమిక పరపతి సహకార సంఘాలలోని రైతులు తమ సభ్యత్వాన్ని తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలని క్రోసూరు పీఏసీఎస్ సీఈవో కె.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సహకార సంఘాల కంప్యూటీకరణలో భాగంగా సంఘంలో సభ్యత్వం కలిగిన ప్రతి ఒక్క రైతు తమ పొలం పాస్‌బుక్, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, ఫోను నంబర్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు సంఘ కార్యాలయంలో అందజేయాలన్నారు. పైన తెలిపిన వివరాలు అందజేయని పక్షంలో వారి సభ్యత్వం రద్దు చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పర్సన్ ఇన్‌చార్జి నరసయ్య తదితరులున్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో బీకాం జనరల్ కొనసాగించాలి

ఏఐఎస్ఎఫ్ నాయకులు



పిడుగురాళ్ల : ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో బీకాం జనరల్ కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు అన్నారు. పట్టణంలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డిగ్రీ కోర్సుల్లో ప్రభుత్వ కళాశాలల్లో బీకాం జనరల్‌ను 42 కాలేజీలకు మాత్రమే పరిమితం చేసిందని, కానీ ప్రైవేటు కాలేజీల్లో బీకాం జనరల్ కొనసాగుతుందని, పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకోలేక పోతున్నారని వెంటనే బీకాం జనరల్ ప్రభుత్వ కళాశాలల్లో కొనసాగేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి మధు, పట్టణ అధ్యక్షులు సాయి, ఉమర్, రాజా, రాహుల్ తదితరులు ఉన్నారు.

రోటరీ క్లబ్ సేవలు ఎనలేనివి



మాచర్ల: పట్టణంలోని పాత కిడ్స్ పాఠశాల, కేసీపీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 37వ రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం జరిగింది. ఈ కార్యక్రమాననికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ రోటరీ క్లబ్ 150కి పైగా దేశాలలో లక్షలాది క్లబ్‌ల ద్వారా పేదవారికి తమ వంతు సహాయ సహకారాలందించటమే కాకుండా ప్రభుత్వాలకు సైతం సాయమందించటంలో గొప్పదని అన్నారు. మాచర్ల పట్టణంలో, మండలంలో రోటరీ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో గొప్ప సేవలందించారని, ప్రభుత్వాసుపత్రికి విలువైన వస్తువులను అందించటం జరిగిందన్నారు. చిన్నారులకు పోలియో రాకుండా రోటరీ క్లబ్ సేవలందిస్తుందన్నారు. నూతన కార్యవర్గ అధ్యక్షురాలిగా కొండవీటి కృష్ణకుమారి, సెక్రటరీగా నిమ్మగడ్డ సురేఖ, అన్నపురెడ్డి లక్ష్మి, ట్రెజరర్, ఉపాధ్యక్షురాలు ఎస్.కల్పనదేవి, సంయుక్త కార్యదర్శి తిరుమల రాధలచే డీసీహెచ్ఎస్ నరసరావుపేటకు చెందిన బి.వెంకట రంగారావు, కె.శరత్‌లు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ గవర్నర్ చంద్రను సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎం.సుమిత్ర కుమార్, తాళ్ళ రాజశేఖర్‌రెడ్డి, డిప్యూటీ గవర్నర్, వైద్యులు కె.రామకోటయ్య, మురహరిరావు, కేసీపీ జనరల్ మేనేజర్ వెంకట రమణ, జేవీకేఎస్ ప్రసాద్, చిలుకూరి నరసింహారావు, బంకు ప్రసాద్, పందిరి నరసింహారావు, మేడం చెన్నకేశవరావు, మేడం శివ, గోపవరపు నాగేశ్వరరావు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు మానుకోవాలి

- అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి
- గ్రాట్యుటీ అమలు చేయాలి
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గుంటూరు విజయ్ కుమార్
- కోరికల దినోత్సవం సందర్భంగా సత్తెనపల్లిలో ప్రదర్శన, సభ



పట్టణంలో ప్రదర్శన చేస్తున్న స్కీమ్ వర్కర్లు, సీఐటీయూ నాయకులు

సత్తెనపల్లి: అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, వీవోఏలు తదితర స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు మానుకోవాలని సీఐటీయూ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు గుంటూరు విజయకుమార్ డిమాండ్ చేశారు. అఖిల భారత కోరికల దినోత్సవం పురస్కరించుకుని అంగన్‌వాడీలు, ఇతర స్కీమ్ వర్కర్లు పట్టణంలో బుధవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. స్థానిక పుతుంబాక భవన్ నుంచి బయలుదేరిన ప్రదర్శన తాలూకా సెంటర్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా జరిగిన సభలో విజయకుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సభకు సీఐటీయూ మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ అధ్యక్షత వహించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినప్పుడల్లా అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, తదితర స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు నిత్యకృత్యం అవుతున్నాయన్నారు. కొత్త ప్రభుత్వం బాగు చేస్తుందని ఆశపడ్డ స్కీమ్ వర్కర్లందరూ భయ బ్రాంతులకు గురై అభద్రతా భావంతో బతకాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ స్కీమ్ వర్కర్లందరూ నామినేటెడ్ పోస్టులు కాదని, అర్హతను బట్టి ఉద్యోగాల్లో చేరిన వారని, అటువంటి వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం గత ప్రభుత్వం ఇచ్చిన హామీలకు సంబంధించిన జీవోలను వెంటనే విడుదల చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వాల నుంచి వస్తున్న ఒత్తిడిలను ఎదుర్కొనేందుకు అన్ని సంఘాలు కలిసి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మున్సిపల్ వర్కర్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఏవో షేక్ హుస్సేన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.హరి పోతురాజు, ఐద్వా జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజిని, పట్టణ కార్యదర్శి గద్దె ఉమాశ్రీ, డీవైఎఫ్ఐ నాయకులు జడ రాజ్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గంజిమాల రవిబాబు, అంగన్‌వాడీ యూనియన్ క్రోసూరు మండల కార్యదర్శి విజయలక్ష్మి, సత్తెనపల్లి మండల అధ్యక్షురాలు సుజాత, సెక్టార్ లీడర్లు ధనలక్ష్మి, దుర్గ భవాని, అంజలి, జ్యోతి లక్ష్మి, వీరమ్మ, రాజ్యలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను బీజేపీ నిర్వీర్యం చేసింది

అమరావతి: దేశవ్యాప్త కార్మికవర్గం సాధించుకున్న ఉద్యోగ కార్మిక చట్టాలకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని సీఐటీయూ మండల కార్యదర్శి బి.సూరిబాబు అన్నారు. బుధవారం ఉద్యోగ కార్మికులు డిమాండ్స్ డే పురస్కరించుకుని స్థానిక తహసీల్దార్ వెంకటరమణారావుకు మండల సీఐటీయూ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం సీఐటీయూ మండల కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడుతూ కార్మిక వర్గం సాధించుకున్న 44 చట్టాలు గత పది సంవత్సరాల బీజేపీ ప్రభుత్వ పాలనలో నిర్వీర్యమయ్యాయన్నారు. గత ఐదు సంవత్సరాల కాలంలో బీజేపీ అవలంభించిన కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికుల పోరాటాల ఫలితంగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ గణనీయంగా బలహీనపడిందన్నారు. నేడు దేశ వ్యాప్తంగా సీఐటీయూ సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగ కార్మికుల డిమాండ్స్ డే సందర్భంగా కార్మిక చట్టాల రక్షణ కోసం పోరాడుతున్నామన్నారు. దేశంలో కార్మికుల హక్కుల రక్షణ కోసం రూపొందించిన సమ్మె హక్కును కూడా బీజేపీ ప్రభుత్వం తొలగించడం దారుణమన్నారు. ఇప్పటికే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసి పని గంటలు పెంచటం జరిగిందని శ్రమకి తగ్గ వేతనాలు ఇవ్వకుండా కార్పొరేట్లకి అనుకూలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు కార్మికులు, రైతులు ఉద్యోగ ఉపాధ్యాయ స్కీం వర్కర్స్ ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తారని ఆశిస్తే ఉద్యోగస్తుల్ని వేధింపులకు గురిచేయటం అధికార కూటమి నాయకుల అహంకారానికి నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు చెల్లించాలని, అంగన్‌వాడీ వర్కర్స్ సాధించుకున్న హక్కుల్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్షుడు ఎస్‌కే రఫీ, ఉపాధ్యక్షులు ఎం.నవీన్, సతీష్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు



ఏవో హుస్సేన్‌కు వినతి పత్రం అందిస్తున్న స్కీమ్ వర్కర్లు, సీఐటీయూ నాయకులు



తహసీల్దార్ వెంకటరమణారావుకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

నకరికల్లు: మండలంలోని చేజర్ల గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ కె.నాగేందర్‌రావు బుధవారం తెలిపారు. చేజర్ల గ్రామంలో అక్రమ మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో గ్రామానికి చెందిన పమ్మి వెంకటేశ్వరరెడ్డి వద్ద 40 క్వార్టర్‌ల మద్యం బాటిళ్ల ఉన్నట్లు గుర్తించి సీజ్ చేశామని ఎస్ఐ తెలిపారు. సదరు వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన ప్రేమికుల జంటలో యువతి మృతి

సత్తెనపల్లి: ఆత్మహత్యకు యత్నించిన ప్రేమికుల జంటలో చికిత్స పొందుతూ యువతి మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల భాగ్యనగర్ కాలనీకి చెందిన బండారు నవీన్ (25), చిలకలూరిపేటకు చెందిన మెడబలిమి అనూష (22) ప్రేమించుకున్నారు. కుటుంబ సభ్యులు అంగీకరించరని భావించిన వారిరువురు ఈ నెల 3న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. వీరిని సత్తెనపల్లి ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించగా చికిత్స పొందుతూ నవీన్ ఈ నెల 5న మృతి చెందిన విషయం తెలిసిందే. అనూష చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. క్షణికావేశం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు వెంకటేశ్వరరావు

అచ్చంపేట: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద బుధవారం యూటీఎఫ్ (యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్) నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిటీని వేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు వేతన సవరణ ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలన్నారు. పాఠశాలల విలీనం జీవో 117ను రద్దు చేయాలన్నారు. సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. మిగులు ఉపాధ్యాయులను అవసరమున్న చోట సర్దుబాటు చేయాలన్నారు. మిగిలిన పోయిన నాడు-నేడు పనులు పూర్తి చేయాలన్నారు. ఖాళీగా ఉన్న ఎంఈవో పోస్టును భర్తీ చేసి ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల శాఖ గౌరవాధ్యక్షులు తుమ్మా శౌర్రెడ్డి, ప్రధాన కార్యదర్శి షేక్ మహబూబ్ బాషా, జిల్లా కార్యదర్శి కె.ప్రకాశరావు, కోశాధికారి పూర్ణచంద్రరావు, మహిళా సంయుక్త కార్యదర్శి వాసవిక న్యక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



యూటీఎఫ్ అచ్చంపేట మండల శాఖ ఉపాధ్యాయులు

హెల్మెట్ లేకుండా వాహనాలు నడపొద్దు

అచ్చంపేట: ద్విచక్ర వాహనదారులంతా తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రమాదాల నుంచి తమ ప్రాణాలను కాపాడుకోవాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు అన్నారు. స్థానిక ఆంజనేయస్వామి విగ్రహ సెంటర్‌లో బుధవారం ఆయన హెల్మెట్ వాడకంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. బైకుపై వెళ్లేటప్పుడు అనుకోని పరిస్థితులలో ప్రమాదం జరిగితే ఎక్కడ గాయమైనా కోలుకోవచ్చు గానీ, తలకు గాయమైతే మాత్రం కోలుకోవడం కష్టమన్నారు. తలకు బలమైన గాయాలై సంవత్సరాలుగా కోమాలో ఉన్నవారు అనేక మంది ఉన్నారని చెప్పారు. చిన్న అజాగ్రత్త వల్ల భారీ నష్టాన్ని కొని తెచ్చుకోవద్దని సూచించారు. హెల్మెట్ పెట్టుకోవడం ఎవరికోసమో అనుకోకుండా మీ క్షేమం, మీపై ఆధారపడిన మీ కుటుంబ సభ్యుల కోసం అనుకోవాలని చెప్పారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరమన్నారు. డ్రైవింగ్ లైసెన్సులను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్ఐ షేక్ షహీబ్‌జాన్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కరిముల్లాషావలి, మనోహర చిన్న, అవర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు

కిశోర బాలబాలికలకు సైబర్ నేరాలపై అవగాహన

క్రోసూరు: మండలంలోని బయ్యారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుడ్ షెపర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కిశోర బాలికలకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. రిసోర్స్ పర్సన్‌గా గుడ్ షెపర్డ్ సంస్థ నుంచి నూతక్కి దిలీప్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ కిశోర బాలబాలికలు సెల్‌ఫోన్‌కి బానిసలవుతున్నారని అన్నారు. ఇంటర్నెట్ లేనిదే రోజు గడవని పరిస్థితుల్లో ఉన్నామన్నారు. మన అనుదిన పనుల్లో ఇంటర్నెట్ ఒక భాగం అయిపోయింది కాబట్టి ఇంటర్నెట్ వాడేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. మన ఫోన్ పాస్‌వర్డ్ ఎవరితోనూ పంచుకోకూడదని తెలిపారు. అలాగే సోషల్ మీడియా, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, స్నాప్ చాట్ లాంటివి వాడేటప్పుడు మన వ్యక్తిగత వివరాలు పంచుకోకూడదని చెప్పారు. ఈ వివరాలు సైబర్ నేరగాళ్లు గమనించి వాటిని ఉపయోగించి మనల్ని బెదిరిస్తారన్నారు. అలాగే మన ఏటీఎం కార్డు పోయినప్పుడు సంబంధిత బ్యాంకుకి వెళ్లి బ్లాక్ చేసుకోవాలన్నారు. యాప్స్ డౌన్‌లోడ్ చేసుకునేటప్పుడు అన్ని వివరాలు ఇచ్చేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే పబ్లిక్ వైఫై కనెక్షన్ వాడితే మన ఫోన్లో ఉన్న సమాచారం తీసుకునే అవకాశం ఉంది కాబట్టి అవసరం ఉన్నంతవరకే ఉపయోగించుకోవాలన్నారు. సైబర్ నేరాలకు టోల్ ఫ్రీ నంబర్ 1930కి కాల్ చేయవచ్చు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుడ్ షెపర్డ్ సంస్థ డైరెక్టర్ సుపీరియర్ సిస్టర్ విన్నరసి, పాఠశాల ఉపాధ్యాయులు, బాలబాలికలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న నూతక్కి దిలీప్ కుమార్

పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలి

రెంటచింతల: జాతీయ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకంపై చిన్న, సన్నకారు రైతులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మండలంలో కచ్చితంగా 200 ఎకరాలలో పండ్ల తోటలను చిన్న, సన్నకారు రైతులు సాగు చేసేలా క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు. పండ్ల తోటలు సాగుచేసే రైతులు 5 ఎకరాలలోపు పంట పొలం, ఉపాధి హామీ జాబు కార్డు కలిగి ఉండాలన్నారు. ఈ పథకం కింద మామిడి, జామ, బత్తాయి, నారింజ, సపోట, దానిమ్మ, సీతాఫలం, నిమ్మ, జీడిమామిడి తదితర 19 రకాల పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. ప్రతి రోజు మండలంలోని 11 గ్రామాలలో సుమారు 13 వేల మంది కూలీలు ఉపాధి పనులకు వచ్చేలా ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ, ఏపీవో జయ చంద్ర కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



ఉరికి వేళ్లాడుతున్న మృతుడు నీరజ్

నకరికల్లు: టైర్ల కొట్టులో కూలీగా పనిచేస్తున్న యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన మండలం చల్లగుండ్ల సమీపంలోని సున్నపుబట్టి వద్ద బుధవారం రాత్రి జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బిహార్‌కు చెందిన వ్యక్తి హైవే పక్కనే టైర్లకు పంక్చర్ వేసే షాపు నిర్వహిస్తున్నాడు. అదే రాష్ట్రంలోని వైశాలీ జిల్లా సగ్గాపూర్‌కు చెందిన నీరజ్ (18) కొన్నాళ్ల క్రితం వచ్చి చల్లగుండ్ల వద్ద గల టైర్ల కొట్టులో కూలీగా పని చేస్తున్నాడు. అదే దుకాణంలో నివాసం ఉంటాడు. కాగా బుధవారం దుకాణ యజమాని పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో దుకాణం వద్దకు వచ్చి చూడడంతో లుంగీతో ఉరేసుకుని వేళ్లాడుతూ ఉండడం గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ కె.నాగేందర్‌రావు, సిబ్బంది వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగేందర్‌రావు తెలిపారు. కాగా మృతదేహంపై ఉన్న గాయాలు, ఉరి వేసి ఉన్న తీరు చూస్తుంటే కొట్టి ఉరి వేసుకున్నట్లుగా చిత్రీకరిస్తున్నారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మాచర్ల: తెల్లవారు జామున పట్టణ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మరణించిన ఘటన పట్టణ పరిధిలోని చెన్నకేశవ నగర్ కాలనీ ప్రాంతంలో బుధవారం చోటు చేసుకుంది. పట్టణ సీఐ బి.బ్రహ్మయ్య తెలిపిన కథనం ప్రకారం మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన దొంతగాని శ్రీనివాసరావు గౌడ్ (45) తెల్లవారుజామున 4 గంటల సమయంలో మాచర్ల పట్టణంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొనటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్రీస్తు చూపిన మార్గంలో ప్రజలను నడిపించాలి



రెంటచింతల: గ్రామీణ ప్రాంతాలలో దైవ వాక్కు (ప్రార్థన) ప్రచారం చేసే పాస్టర్లు ప్రజలను యేసుక్రీస్తు చూపిన సన్మార్గంలో నడిపించాలని పాస్టర్ ఎస్.సత్యం అన్నారు. బుధవారం స్థానిక అంకమ్మనగర్ కాలనీలోని యేసుక్రీస్తు ప్రార్థన మందిరం 7వ వార్షికోత్సవం సందర్భంగా 50 మంది పాస్టర్లతో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన కూడికలో ఆయన మాట్లాడారు. ప్రపంచ మానవాళిని పాపముల నుంచి రక్షించుటకై సిలువ మరణం పొందిన దేవుని కుమారుడైన యేసును ఆరాధించి ఆయన అడుగుజాడలలో నడవాలని కోరారు. యేసుక్రీస్తు సూక్తులు ఆచరిస్తూ సమాజంలో ప్రజల పట్ల ప్రేమ, కరుణ, జాలి, దయ కలిగి శాంతియుతంగా జీవించాలన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు పల్లెర్ల లక్ష్మారెడ్డిని ఘనంగా సన్మానించారు. భక్తులకు అన్నదానం చేశారు. పెద్దలు మాజీ ఎంపీటీసీ వై.రమేష్, ఆదూరి శివ, వై.శ్రీనివాసరావు, కె.సైదులు, ఎస్.నర్సింహారావు, లేళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు జారీ చేయాలి

సత్తెనపల్లి: ప్రతి కౌలు రైతుకు పంట సాగుదారు (సీసీఆర్సీ) కార్డు జారీ చేసి బ్యాంకుల ద్వారా పంట రుణాలు ఇప్పించాలని డీబీఆర్సీ రీజనల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో పంట సాగుదారుల హక్కు చట్టంపై ఆటో ప్రచార ఉద్యమ కార్యక్రమాన్ని నందిగామ పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావు బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ సత్తెనపల్లి మండలం నందిగామ, అబ్బూరు, ఫణిదం, బట్లూరు గ్రామాలలో కౌలు రైతుల ప్రచార ఉద్యమం నిర్వహించటం జరుగుతుందని, పంట సాగుదారు కార్డు దారులందరికీ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో క్రాప్ లోన్లు మంజూరు చేయడం, కిసాన్ క్రెడిట్ కార్డులు అందించడం, వివిధ రుణ సంస్థల నుంచి తీసుకున్న రుణాన్ని ఇంత వరకు చెల్లించని రైతులకు తిరిగి రుణం చెల్లించేటట్లు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, సాగుదారు కార్డు పొందిన వారికి ఆ భూమిపై ఎటువంటి హక్కులు రావని కేవలం పంట రుణాలు, బీమా, సబ్సిడీ వంటి ప్రభుత్వ మద్దతు పొందటానికి మాత్రమేనని, కార్డుపై సాగుదారు బ్యాంకు నుంచి పంట రుణాలు తీసుకున్నట్లయితే దానిని కట్టే బాధ్యత పూర్తిగా కౌలు దారుదేనన్నారు. యజమానిపై ఎటువంటి భారం ఉండదని, కనుక భూ యజమానులు సాగుదారులకు సాగుదారు కార్డు పొందటానికి సహకారం అందించాలని కోరారు. కౌలు రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని, వారికి పూర్తి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో డీబీఆర్సీ ఏరియా కోఆర్డినేటర్స్ మేడే వెంకటరమణ, కోటి రత్నం, కౌలు రైతులు తదితరులు ఉన్నారు.



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావు, పక్కన డీబీఆర్సీ నాయకులు

నవధాన్యం సాగులో పంట కోత ప్రయోగం

రాజుపాలెం: మండలంలోని గణపవరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమంలో భాగంగా 30 రకాల విత్తనాలతో సాగు చేసిన పొలంలో పంట కోత ప్రయోగం బుధవారం నిర్వహించారు. ఈ పంట కోత ప్రయోగంలో జిల్లా ఎన్ఎఫ్ఏ సైదయ్య పాల్గొని నిర్వహించారు. సానె రమణయ్య వ్యవసాయ క్షేత్రంలో 30 రకాల విత్తనాలతో పీఎండీఎస్ వేయడం జరిగింది. పంట వేసి 40 రోజులు కావడంతో పంట కోత ప్రయోగం నిర్వహించగా ఒక ఎకరంలో 9 టన్నులు దిగుబడి వచ్చినట్లు గుర్తించారు. అనంతరం ఎన్ఎఫ్ఏ సైదయ్య మాట్లాడుతూ ఈ విధానం వలన ఎలాంటి పోషక లోపం లేకుండా ఉంటుందని, భూమి సారవంతమవుతుందని, సూక్ష్మజీవుల ఉత్పత్తి అధికంగా ఉంటుందని, నీటిని నిలుపుకునే శక్తి పెరుగుతుందని తెలిపారు. ప్రతి రైతు ఈ విధానాన్ని ఆచరించడం ద్వారా ఖర్చు తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి కె.జ్యోతి, ఎస్.రమణయ్య, బి.శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరావు, పి.మరియరాణి రైతులు తదితరులు పాల్గొన్నారు.



పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయదారులు

షేడ్‌నెట్ నర్సరీల నిర్వాహకులు లైసెన్స్ కలిగి ఉండాలి

ఉద్యాన శాఖ అధికారి దాసరి నవీన్‌కుమార్

క్రోసూరు: షేడ్‌నెట్ నర్సరీల నిర్వాహకులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని ఉద్యాన శాఖ అధికారి దాసరి నవీన్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని షేడ్‌నెట్ నర్సరీలను ఉద్యాన అధికారి దాసరి నవీన్ కుమార్, మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్ సందర్శించారు. మండలంలోని అనంతవరం, క్రోసూరు గ్రామాల్లోని నర్సరీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ అధికారి మాట్లాడుతూ ప్రతి షేడ్‌నెట్ నర్సరీ యజమాని తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని చెప్పారు. దీనికి గాను దగ్గర్లోని రైతు సేవ కేంద్రంలో అర్జీ పెట్టుకోవాలని తెలియజేశారు. లైసెన్స్ లేని నర్సరీలకు నోటీసులు అందజేసినట్లు చెప్పారు. వారం రోజుల వ్యవధిలో ప్రతి షేడ్‌నెట్ నర్సరీ యజమాని లైసెన్స్ పొందాలని తెలిపారు. లైసెన్స్ లేని నర్సరీలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి యజమాని రైతు తెచ్చే విత్తనాలకు సంబంధించిన బిల్లు నకలు కాపీ తీసుకుని భద్రపరచాలని తెలిపారు. నర్సరీల్లో వినియోగించిన విత్తనాలు, విక్రయించిన నారు, రకాలకు సంబంధించిన రిజిస్టర్లను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు.



నర్సరీ నిర్వాహకుడికి లైసెన్స్ అందిస్తున్న దృశ్యం

పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడిగా సుదర్శన్

కారెంపూడి: పాస్టర్స్ ఫెలోషిప్ కారెంపూడి మండల అధ్యక్షుడిగా సుదర్శన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కారెంపూడి శివారు ఆదినారాయణ కాలనీలో బుధవారం పాస్టర్లు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కొమ్ము జాకబ్, కార్యదర్శిగా జె.జాన్సన్, సంయుక్త కార్యదర్శిగా వై.రవికుమార్, పి.జోసెఫ్, కోశాధికారిగా షేక్ జానీ, కె.ఇమ్మానియేలు, గౌరవాధ్యక్షులుగా మాచర్ల ప్రకాశరావు ఎన్నికయ్యారు.